విద్యార్థుల కోసం 'ఉన్నతి'

- హైస్కూల్ స్థాయి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ
- ముగిసిన ఉన్నతి శిక్షణ


ప్రొజెక్టర్‌తో ఉపాధ్యాయులకు శిక్షణ

రామగుండం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని డిజిటల్ విద్యాబోధన చేస్తూ విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందించడంలో భాగంగా ఉన్నతి కార్యక్రమం ప్రారంభించారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉన్నతి ప్రోగ్రాం ద్వారా వివిధ సబ్జెక్టులతో గుణాత్మక బోధన ద్వారా వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దడం ఉన్నతి లక్ష్యం. వివిధ సబ్జెక్టు టీచర్లకు మూడురోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి చదువుపై శ్రద్ధ కలిగేలా చేయడం, చదువంటే భయం పోగొట్టి సబ్జెక్టుపై ఆసక్తి కలిగేలా చేయడమే ఈ ఉన్నతి లక్ష్యం.

టీచర్లకు మూడురోజుల శిక్షణ

ఉన్నతి ప్రోగ్రామ్‌కు ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఆగస్టు 19–21వ తేదీల్లో హైదరాబాద్‌లో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు చదువులో వెనుకబడడానికి కారణాలు, దానికి దారితీసిన పర్యవసానాలను తెలుసుకోవడం, అభ్యసనాభివృద్ధి అమలు పరచడంపై అవగాహన కల్పించారు. పాఠ్యాంశాలు పూర్తి చేయడం కంటే ఫలితాలు సాధించడమే ముఖ్యమనే విషయాలను గుర్తించడం. బోధనాభ్యసన సామగ్రి వినియోగిస్తూ సులభ రీతిలో విద్యార్థులను ఆకట్టుకునేలా విద్యాబోధన చేయడంతో చదువుపై ఆకస్తి కనబరిచే అవకాశం ఉంటుంది.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా..



వెనుకబడిన విద్యార్థులు చదువుపై ఆసక్తిని కనబరిచేలా తీర్చిదిద్దడమే ఉన్నతి లక్ష్యం. ప్రతి పాఠ్యాంశంలోని భావాలు, అందులో ఉన్న సబ్జెక్టును నిజజీవితంలో సాధారణ అంశాలతో ముడిపెడుతూ వారికి చదువుపై శ్రద్ధ పెరిగే విధంగా చేయడం. ఫలితంగా వెనుకబడిన విద్యార్థుల్లో బడి భయం తొలగి చదువుపై ఆసక్తి పెరిగి ఇతర విద్యార్థులతో పోటీ పడే అవకాశం ఉంటుంది.

– తానం స్వర్ణ, ఉన్నతి కోర్సు డైరెక్టర్

శిక్షణ అనంతరం అమలు



మండలాలు, డివిజన్లలోని పాఠశాలల ఉపాధ్యాయులకు సబ్జెక్టు ట్రైనర్లు మూడురోజుల పాటు ఉన్నతి ప్రోగ్రాంలో భాగంగా అమలు చేయాల్సిన విద్యాబోధన సరళి తదితర విద్యా, విషయక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ బుధవారంతో ముగిసింది. అనంతరం ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లో అమలు చేయాలని ఆదేశించాం. ఉన్నతి ప్రోగ్రాం ఫలితాలతో కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడే స్థాయికి చేరుతారని ఆశిస్తున్నాం.

– భవానీ, మండల నోడల్ అధికారి


ముత్తారం: కేజీబీవీలో కృష్ణాష్టమి వేడుకలు


జ్యోతినగర్: గోపిక వేషధారణలో చిన్నారులు


సుల్తానాబాద్: గోపిక వేషధారణలో చిన్నారులు


గోదావరిఖనిటౌన్: పూజల్లో మక్కాన్‌సింగ్


బసంత్‌నగర్‌లో ఉట్టి కార్యక్రమం


కాల్వశ్రీరాంపూర్: కృష్ణాలయంలో పూజలు


కమాన్‌పూర్‌లో..

వైభవంగా కృష్ణాష్టమి

పెద్దపల్లి జిల్లావ్యాప్తంగా గురువారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పలు కాలనీల్లో చిన్నారులు గోపిక, కృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


ఎలిగేడు: ధూళికట్టలోని గాయత్రి పాఠశాలలో..

క్లుప్తంగా

డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు వేయొద్దు


శుభ్రం చేయిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

సుల్తానాబాద్: వర్షాలు కురుస్తున్నందున పట్టణ ప్రజలు డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, చెత్త వెయొద్దదని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ కోరారు. పట్టణంలోని పలు కాలనీల్లో డ్రైనేజీలను గురువారం మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు. ప్లాస్టిక్ కవర్లతో పాటు ఇతర చెత్త వేయడంతో డ్రైనేజీల్లో ఎక్కడికక్కడే మురుగు నిలిచి రోడ్లపైకి అవకాశం ఉందని, ప్రజలు మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే సీజనల్ వ్యాధులు రావన్నారు. పరిసరాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, వార్డు అధికారులు సదయ్య, రమేశ్, సిబ్బంది ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి

జ్యోతినగర్: ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని రామగుండం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు అన్నారు. గురువారం కృష్ణానగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గాదంశెట్టి రాజును సన్మానించారు. బుర్ర శంకర్‌గౌడ్, బండి తిరుపతి, చందు, ఆనంద్, వెంకటేశ్, గొడుగు శ్రీనివాస్, వంశీ పాల్గొన్నారు.

గోశాలకు పశుదాన అందజేత


పశుదాన అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

సుల్తానాబాద్: లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో పవిత్ర కృష్ణాష్టమి సందర్భంగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని యాదవ నగర్‌లో నిర్వహిస్తున్న శ్రీధర్మశాస్త్ర గోశాల ఫౌండేషన్ ప్రతినిధి బండారి సూర్యంకు 50కేజీల పశుదానను లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పిట్టల వెంకటేశం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు నోముల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య, జిల్లా కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న స్వాతి, ప్రవీణ్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పూసాల శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణకు రూ.65వేల విరాళాన్ని సుల్తానాబాద్‌కు చెందిన మిట్టపల్లి స్వాతి–ప్రవీణ్ దంపతులు గురువారం అందజేశారు. ఆలయ పునరుద్ధరణకు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు విరాళం అందజేసి సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ కోట రంగారెడ్డి, కమిటీ సభ్యులు పురం ప్రేమ్‌చందర్ రావు, పురం రమణ కోరారు.

ఎల్లమ్మ ఆలయానికి..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలో గీతకార్మికులు నిర్మిస్తున్న ఆలయ నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు సమకూర్చిన రూ.25వేలను సంఘ నాయకులకు అందించినట్లు మాజీ సర్పంచ్ చంద శంకర్ తెలిపారు. గౌడసంఘ నాయకులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

సదస్సు విజయవంతం చేయండి

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని తిలక్‌నగర్‌లోని విశ్వం కమ్యూనిటీ హాల్‌లో 10న నిర్వహించే దళిత సామాజిక పరిరక్షణ సమితి సదస్సును విజయవంతం చేయాలని నాయకులు చిలుక ప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానికంగా నిర్వహించిన సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని దళితులను ఏకం చేసే కార్యక్రమంలో భాగంగా దళిత సామాజిక పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమానికి దళితులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మద్యం మత్తులో గొడవ

పెద్దపల్లిరూరల్: మద్యం మత్తులో ఇరువర్గాలు గొడవపడ్డ ఘటనపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో కొమ్మినేని నరేశ్‌కుమార్, అనిల్‌కుమార్, సార్ల శ్రీకాంత్, చిలుముల సదానందం, కరుణాకర్ ఎదురుపడగా దారి విషయమై వాగ్వాదంతో మొదలైన గొడవ కొట్లాటకు దారి తీసింది. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦నేడు కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కామన్ సర్వీస్ సెంటర్‌ను శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కార్యదర్శి సంతోష్‌కుమార్ తెలిపారు.

✦అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

రామగుండం: అంతర్గాం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం అంతర్గాం మండల అధ్యక్షుడు ఇండిబిల్లి రవీందర్ కోరారు. 13న విగ్రహావిష్కరణ ఉంటుందని తెలిపారు. అంతర్గాం ప్రెస్‌భవన్‌లో ఆహ్వానపత్రికను గురువారం ఆవిష్కరించారు. వివిధ పార్టీల నాయకులు నాగమయ్య, మాడ నారాయణరెడ్డి, ఒల్లెపు స్వామి, గోపి, సుభాష్, అంజయ్య ఉన్నారు.

✦విద్యార్థికి సన్మానం

కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామానికి చెందిన ఆకుల సదయ్య కూతురు ఆకుల అర్చన సిద్దిపేట జిల్లాలోని సురబి మెడికల్ శాశాలలో ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. కాగా బుధవారం ఎంపీపీ రాసకొండ లక్ష్మి ఆమెను సన్మానించారు.

✦మండల యూత్ అధ్యక్షుడిగా లక్ష్మణ్

రామగిరి: బీజేపీ మండల యూత్ అధ్యక్షుడిగా రత్నాపూర్ గ్రామానికి చెందిన కోండు లక్ష్మణ్ నియామకమయ్యారు. మంథని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సునీల్‌రెడ్డి గురువారం నియామకపత్రం అందజేశారు.

✦బీఎస్పీలో చేరిన అంబటి నరేశ్

గోదావరిఖని: ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ గురువారం బీఎస్పీలో చేరారు. పెద్దపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరగా ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నరేశ్‌తో పాటు 30మంది పార్టీలో చేరారు.

✦ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లిలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మునీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. రేకుర్తి కంటి ఆసుపత్రికి చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేశ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి మండలంలోని బొమ్మారెడ్డిపల్లి, కొత్తపల్లి, ఎర్రగుంటపల్లి, కటికెనపల్లి గ్రామాలకు చెందిన 154 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు.

✦కేకేనగర్‌లో ఉచితవైద్య శిబిరం

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధి కేకేనగర్‌లో గురువారం ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్యామ్, ఎన్‌జీవో ప్రోగ్రామర్ మహేందర్, వైద్య బృందంతో దాదాపు 100 మంది ప్రజలకు రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

ధర్మారం: మండలంలోని గిరిజన గ్రామమైన కొత్తపల్లి గ్రామంలో గురువారం గ్రామ సర్పంచు కోమటిరెడ్డి లలిత ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మంత్రి ప్రత్యేక చొరవతో గిరిజన అభివృద్ధి శాఖ ద్వారా కొత్తపల్లి నుంచి నాయకం తండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.15లక్షలు మంజూరైనందుకు గిరిజనతండా వాసులు హర్షం వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ఉపసర్పంచు రవినాయక్, నాయకులు ఆలు నాయక్, శ్రావణి, రాములు, తిరుపతిరెడ్డి, మామిడియా నాయక్, జలపతినాయక్ పాల్గొన్నారు.

జీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు


జీఎంను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆర్జీ–2 జీఎం సూర్యనారాయణను గురువారం మార్యదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్, మాజీ కార్పొరేటర్ మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, విజేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సదానందం, తిరుపతి, ఓదెలు తదితరులు ఉన్నారు.

చిన్నయ్య, పెద్దయ్యకు మొక్కులు చెల్లింపు


మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్తులు

ముత్తారం: మండలంలోని లక్కారంలో గురువారం గ్రామస్తులు చిన్నయ్య, పెద్దయ్య దేవుళ్లకు మొక్కులు చెల్లించారు. రైతులు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని మొక్కులు చెల్లించామని గ్రామపెద్దలు తెలిపారు. అనంతరం గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. సర్పంచ్ అత్తె లలిత, ఎంపీటీసీ ఒడ్డి తిరుమలతిరుపతి, మండల రైతుబంధు అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణలో డ్రైవర్లదే కీలకపాత్ర


నంబర్లు కేటాయిస్తున్న సీఐ వేణుగోపాల్

యైటింక్లయిన్‌కాలనీ: రోడ్డు ప్రమాదాలను నివారించడంతో డ్రైవర్లదే కీలక పాత్ర అని గోదావరిఖని టూటౌన్ సీఐ వేణుగోపాల్ అన్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఆధ్వర్యంలో గురువారం కమాన్‌పూర్, రామగిరి, యైటింక్లయిన్‌కాలనీకి చెందిన టాటా ఏసీ యజమానులు యూనియన్‌గా ఏర్పడడంతో సీఐ టాటా ఏసీ మ్యాజిక్ వాహనాలకు యూనియన్ కోడ్ నంబర్లు కేటాయించారు. ఈ సందర్భాంగా సీఐ ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానితులు తమ వాహనాలలో ప్రయాణిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ వాహనాలు నడపాలని, ప్రతి ఒక్కరూ తమ డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. యూనియన్ అధ్యక్షుడు రాజయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, శేఖర్, సంపత్ స్వామి, నరేశ్, టూటౌన్ రెండో సీఐ అఫ్జలొద్దీన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

పాలకుర్తి: అన్నివర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి, బసంత్‌నగర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. చెరువు కట్టపై బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.64లక్షలు, మున్నూరు కాపు, ముదిరాజ్ కుల సంఘాల భవన నిర్మాణాలకు రూ.20లక్షలు మంజూరు కాగా భూమిపూజ చేశారు. బసంత్‌నగర్‌లో సీసీ రోడ్డు, ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఉచిత కుట్టుశిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పుట్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, మేడిపల్లి సింగిల్‌విండో చైర్మన్ ప్రభాకర్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈసాలతక్కళ్లపల్లి అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలకు పట్టాపత్రాలను అందజేశారు.

కనులపండువగా శోభాయాత్ర


ఉట్టి కొడుతున్న ఒగ్గు కళాకారులు

ధర్మారం: మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యాదవసంఘం మండల అధ్యక్షుడు ఆవుల ఎల్లయ్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తి నిస్థానిక యాదవ సంఘం భవనం నుంచి శోభయాత్ర నిర్వహించారు. ఒగ్గు కళాకారుల నృత్యాలు, మహిళల కోలాటాలతో శోభాయాత్ర సాగింది. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో యాదవ ఒగ్గు కళాకారులు ఉట్టి కొట్టారు. స్థానిక పాత బస్టాండ్ ఏరియాలో యువకులు పోటాపోటీగా ఉట్టి కొట్టారు. సర్పంచ్ పుస్కూరి జితేందర్‌రావు, యాదవసంఘం యూత్ ప్రధాన కార్యదర్శి పానవేని స్వామి, జిల్లా నాయకులు వేల్పుల నాగరాజు, మహేందర్‌యాదవ్, మల్లయ్య పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు


మాట్లాడుతున్న ప్రీతం

రామగుండం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. ఈ మేరకు గురువారం అంతర్గాం మండల కేంద్రంలో ఏఐఎస్ఎఫ్ సమావేశం నిర్వహించారు. ఫీజుల నియంత్రణ చట్టం, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు, సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీల భర్తీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ అంతర్గాం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కుల నరసింహ, కార్యదర్శి కొటం సాయి, ఉపాధ్యక్షుడు రావుల శివాజీ, సహాయ కార్యదర్శి గాదం కుమార్, కోశాధికారి కొటం సిద్ధు, కార్యవర్గ సభ్యులు రెబ్బ రక్షిత్, వినయ్, శోకాల సాయి, అల్లం శ్రావణ్, రెడ్డిమల్ల మల్లిఖార్జున్ ఉన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రామగుండం: గ్రామసభలో పలు అంశాలపై ప్రశ్నించిన సామాజిక కార్యకర్త పల్లె శ్రీనివాస్‌పై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ అన్నారు. ఈ మేరకు గురువారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట పంచాయతీ ఎదుట బైఠాయించి పాలకవర్గ చర్యలను నిరసిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల రమేశ్, జేఏసీ నాయకుడు మాధవరావు, బర్పటి శ్రీనివాస్, ఎనగందుల శ్రీకాంత్, ఆడెపు శంకర్, మార్త రాములు, మార్త రాధ, పెండ్యాల సాయమ్మ, బోయపోతు మల్లేశ్, పైడిపల్లి వెంకటస్వామి, గట్టు విజయ్ ఉన్నారు.

ప్రశ్నిస్తే దాడులా?

అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామసభలో సమస్యలపై నిలదీసిన అదే గ్రామానికి చెందిన పల్లె శ్రీనివాస్‌పై అధికార పార్టీ నాయకులు దాడులకు పాల్పడడం సరికాదని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు పిడుగు కృష్ణ అన్నారు. గురువారం అంతర్గాం ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంఘం ప్రతినిధులు ఉన్నారు.

దాడికి పాల్పడడం సరికాదు..

పల్లె శ్రీనివాస్‌పై అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం అంతర్గాం మండల ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు.

ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్

పెద్దపల్లి రూరల్: రెండేళ్లలో ఇంటింటికీ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందించనున్నట్లు రాష్ట్ర టెలికాం రెగ్యులేటరీ అథారిటీ సభ్యురాలు శోభారాణి అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య భవన్‌లో మాట్లాడారు. నాట్‌టుడిస్టర్బ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ నంబరును నమోదు చేసుకుంటే అనవసరపు కాల్స్ రావన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను నియంత్రించేందుకు 1909 నెంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు.

కొనసాగుతున్న నిరసన


చిన్నికృష్ణులకు విన్నవిస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లిరూరల్: స్థానిక అమరవీరుల స్తూపం వద్ద నిరసనలు కొనసాగిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలంటూ విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు చేస్తున్న దీక్షలు గురువారం 8వ రోజుకు చేరాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్ని కృష్ణుల వేషధారణలో ఉన్న చిన్నారులకు విన్నవించారు. అనంతరం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌ను కలిసి సమస్యల సాధనకు సహకరించాలని కోరారు. నాయకులు సు ధాకర్, వెంకటేశం, తిరుపతి, రవిరాజ్, శ్రీనివాస్, మల్లయ్య, శ్రీలత, రహీం, శ్రవణ్, సంపత్ పాల్గొన్నారు.

న్యాయశాఖ కార్యదర్శికి సన్మానం


సన్మానిస్తున్న ముకాస నాయకులు

రామగిరి: మండలంలోని కల్వచర్లకు చెందిన రేండ్ల తిరుపతి రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా గురువారం కల్వచర్ల మున్నూరు కాపు సంఘం నాయకులు సన్మానించారు. భవిష్యత్‌లో మరెన్నో పదవులు పొందాలని, రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శిగా నియామకమవడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామగిరి మండల ముకాస ఉపాధ్యక్షుడు దేవ శ్రీనివాస్, కుడిది వేణుగోపాల్, కొప్పుల సునీల్, రేండ్ల కృష్ణమూర్తి, వరాల హరీశ్, తోట శంకర్, రాజయ్య పాల్గొన్నారు.